క్లుప్తంగా

గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలి



సమ్మెలో పాల్గొన్న దినసరి కూలీలు

కాళేశ్వరం: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న దినసరికూలీలు, కాంటినింజెంట్‌కు జీఓ నంబర్ 64ను నిలిపి, పాతపద్ధతి ప్రకారం కలెక్టర్ గెజిట్‌తో వేతనాలు అందజేయాలని కోరుతూ సమ్మె చేపట్టారు. మహదేవపూర్ మండలం కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు తులసిరామ్, ఉపాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో ఈ సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖదీర్, పోసక్క, జావీద్, లక్ష్మి, వీరస్వామి, రాజక్క, సరోజన, భాగ్య, సారక్క, పుష్ప పాల్గొన్నారు.

పరపతి సంఘం కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కాకతీయ ముదిరాజ్ పరస్పర సహాయ సహకార పొదుపు పరపతి సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు ఆ కమిటీ గౌరవ సలహాదారులు కిసరి యాదగిరి, కంచెం నరసింహమూర్తి ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా కొలిపాక మల్లయ్య, ఉపాధ్యక్షులుగా నరెడ్ల ఐలయ్య, వేముల రాజమౌళి ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజయ్య, కోశాధికారి కారుపాకల చందు, సహాయక కార్యదర్శిగా తీగల సంతోష్, గౌరవ సలహాదారులు నరసింహ, రాజకుమార్, దాసరి వెంకటేష్, నాగభూషణం ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

నియామకం



మొగుళ్లపల్లి: బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా కళాశ చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా మురహరి మనోజ్‌ను నియమించినట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా బీఎస్పీ బలోపేతానికి కృషిచేస్తామని చిరంజీవి, భిక్షపతిగౌడ్ పేర్కొన్నారు. తమ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల కార్యవర్గం..

కాటారం: బీజేపీ మహాముత్తారం మండల కమిటీ కార్యవర్గాన్ని శనివారం నియమించినట్లు మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పేర్కొన్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా బానోత్ సిల్వరాజ్, దాసరి కిశోర్, కల్వచర్ల నరేశ్, ఐత అనిల్‌రెడ్డి, కోశాధికారిగా ఆజ్మీరా నితిన్ నియామకమైనట్లు పేర్కొన్నారు.

బతుకమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో బతుకమ్మ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల రాకేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతీ ఏటా బతుకమ్మ పండగను రోడ్డుపై నిర్వహించడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి బతుకమ్మ ఆడుకోవడానికి స్థలాన్ని సేకరించి, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఎస్‌జీఎఫ్ క్రీడలు

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నేడు(ఆదివారం) స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ చైర్మన్, మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్, మండల కన్వీనర్ పృథ్వీరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న బాల బాలికలు క్రీడల్లో పాల్గొనాలని ప్రకటనలో సూచించారు.

సీజనల్ భయం



ఎడ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



తాడిచర్ల పీహెచ్‌సీలో క్యూలో ఉన్న జనం

- వాతావరణ మార్పులతో వ్యాపిస్తున్న జ్వరాలు
- ఆస్పత్రికి క్యూ కడుతున్న జనం
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ

మల్హర్: వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం రోజుకో విధంగా మారుతున్నాయి. ఉదయం వర్షం కురిస్తే మధ్యాహ్నం ఎండ దంచికొడుతుంది.. సాయంత్రం సాధారణంగా ఉంటే అర్ధరాత్రి చలిగా ఉంటుంది. ఇలా వాతావరణ మార్పులతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఒంట్లో నలతగా ఉండటం, జ్వరాలతో ఇబ్బందులు పడటం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతి పది మందిలో నలుగురికి జలుబు, ఇద్దరికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. దీంతో తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నిసత్తువగా ఉంటుంది. కొందరిలో ఒంటిపై దుద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. మరికొందరిలో జలుబు వంటి లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వస్తాయి. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వంటి వైరల్ ఫీవర్ కిందకే వస్తాయంటున్నారు.. వైద్యులు.

వైరల్ ఫీవర్‌కు కారణాలు..

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వైరల్ ఫీవర్స్ వస్తుంది. ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. ఇంటి ఆవరణలో పూల తొట్లలో నిలిచిన నీటిని తొలగించడంతోపాటు పాత టైర్లు, పాత డబ్బాల్లో నిలిచిన నీటిని తొలగించాలి. ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి.

పెరుగుతున్న ఓపీ కేసులు

సీజనల్ వ్యాధులతో మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ఓపీ కేసుల సంఖ్య పెరుగుతున్నాయి. వారం రోజులుగా జ్వరం, జలుబు, దగ్గు ఒళ్లు నొప్పులతో ఆస్పత్రికి జనం క్యూ కడుతున్నారు. తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల తదిత గ్రామాల నుంచి ప్రతి రోజూ 100 నుంచి 150 మందికిపైగా రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి రక్త, మూత్ర పరీక్షలు చేసి రిపోర్టుల ఆధారంగా వైద్య సిబ్బంది మందులను అందిస్తున్నారు. ఎడ్లపల్లి గ్రామంలో గత గురువారం విష జ్వరంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ ఆవరణ మెడికల్ క్యాంపు నిర్వహించి, 50 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. దోమ తెరలను వినియోగించాలి. పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, నీటి గొట్టాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగితే మంచిది.

\- వినయ్ భాస్కర్, వైద్యాధికారి, మల్హర్

బీసీలు రాజ్యాధికారాన్ని అందిపుచ్చుకోవాలి

- వంగ రవి యాదవ్



సభ్యత్వ నమోదు పత్రాలతో బీసీ నాయకులు

భూపాలపల్లి రూరల్: బీసీలు రాజ్యాధికారం వైపు పయనించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ మెంబర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ సమితి జిల్లా నాయకుడు గట్ల రాజన్న అధ్యక్షతన కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంగ రవి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. దేశంలో బీసీలు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని అన్నారు. 42 శాతానికి రిజర్వేషన్ అమలుపరచాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి బీసీ రాజ్యాధికార సమితి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. బీసీలు రాజకీయ పదవులు అనుభవించాలని విద్య ఉద్యోగ అవకాశాలను, బీసీలకి దక్కే విధంగా బీసీలంతా ముక్తకంఠంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, జిల్లా నాయకులు జోగు బుచ్చన్న, అక్క పెల్లి సదానందం, వేణుగోపాల్ యాదవ్, మేకల రజిత యాదవ్, కొక్కు అశోక్ ముదిరాజ్, లింగాల నాగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



తాడిచర్లలో నివాళులర్పిస్తున్న మధు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో సమ్మయ్య, పెద్ద పోచాలు, మణి, మల్లారంలో ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, యూత్ అధ్యక్షుడు జాగిరి హరీష్, నాయకులు రామరావు, మధుసూదన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనేక ఇబ్బందులు

- కోఆర్డినేటర్ తిరుపతి



వేంకటేశ్వర ఆలయంలో అవగాహన కల్పిస్తున్న ఎన్జీఓ ప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: బాల్యవివాహాలతో బాలల భవిష్యత్ ఆగం అవుతుందని మానసిక, సామాజిక, శారీరక ఇబ్బందులు ఎదురవుతాయని జస్ట్‌రైట్స్ ఫర్ చిల్డ్రన్ సహాయ ఎన్జీఓ డిస్ట్రిక్ కో- ఆర్డినేటర్ తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా శనివారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. సెప్టెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా 39 దేశాల్లోని వివిధ మత పెద్దలతో బాల్యవివాహాల నిర్మూలన కోసం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన హిందూ దేవాలయాల్లోని పురోహితులు, అర్చకులు, భక్తులను కలిసి బాల్యవివాహాల చట్టంపై వివరించినట్లు తెలిపారు. చట్ట ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకి 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు జరపబోమని పూజారులు, అర్చకులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శివాలయ అర్చకులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ముట్టడిని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులకు పెంచి ఇస్తామన్న పింఛన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. రేపు(సోమవారం) పింఛన్‌దారులతో భూపాలపల్లి తహసీల్దార్ కార్యాలయం ముట్టడించనున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాంబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పింఛన్ పెంచే వరకు ఆందోళన కార్యక్రమాలు ఆగవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బొల్లి బాబు మాదిగ, నోముల శ్రీనివాస్, దొర్నాల రాజేందర్, దూడపాక శ్రీనివాస్, అంతడుపుల సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ ఆదేశాలతో..

మల్హర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని రేపు (సోమవారం) ముట్టడించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృద్ధులు, వితంతులు, చేనేత, బీడీ కార్మికులకు అందిస్తున్న ఫించన్లు రూ.2 వేల నుంచి రూ.4వేలు, వికలాంగులకు రూ. 4వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు.

దానం ఇచ్చిన భూమిని కాపాడండి


- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ప్రజలు



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చిట్యాల: దానం ఇచ్చిన భూమిని కాపాడాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన రాంనగర్ ఎస్సీ కాలనీ గ్రామస్తులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గతంలో గ్రామానికి చెందిన బీరవోలు పాపిరెడ్డికి చెందిన భూములను విక్రయిస్తున్న క్రమంలో కాలనీకి చెందిన పెద్ద మనుషులు కీ.శే.ఆరెపల్లి ఆగయ్య, కట్కూరి నర్సయ్య, ఆరెపెల్లి అంకూస్, మరికొంత మంది పాపిరెడ్డి దగ్గర ఎట్టిచాకిరి చేశామని, తమ కాలనీకి దానంగా 10 గుంటల భూమిని ఇవ్వాలని వేడుకున్నారు. దీంతో పాపిరెడ్డి సర్వే నంబర్ 809/1లో ఆరు గుంటల భూమిని కేటాయిస్తూ అప్పటి సర్పంచ్ కొక్కుల సదానందం ఆధ్వర్యంలో 1997 సంవత్సరంలో పత్రాన్ని రాసి ఇచ్చారు. నాటి నుంచి ఖాళీగా ఉన్న స్థలంపై గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు కన్నేసి విక్రయించేందుకు ప్రయత్నించి గుంటకు రూ.లక్ష చొప్పున ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో గ్రామస్తులంతా స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేయగా ఆయన తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దానం ఇచ్చిన భూమిపై సమగ్ర విచారణ జరిపి హద్దులను ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు దాసారపు సాంబయ్య, ముత్యాల వినోద, లక్ష్మి, సరోజన, సమ్మక్క, జ్యోతి తదితరులు ఉన్నారు.

ప్రధాని పేరు లేకపోవడం శోచనీయం



శిలాఫలకం వద్ద మాట్లాడుతున్న నాయకులు

కాటారం: కేంద్ర ప్రభుత్వ నిధులతో మహాముత్తారం మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనం ప్రారంభోత్సవ శిలాఫలకంలో ప్రధాన మంత్రి మోదీ పేరు పెట్టకపోవడం శోచనీయమని బీజేపీ మహాముత్తారం మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బాలికల విద్యను ప్రోత్సహించడానికి సర్వశిక్షా అభియాన్ ద్వారా కేజీబీవీలను ఏర్పా టు చేసిందన్నారు. భవన నిర్మాణంలో 60 శాతం కేంద్రం నిధులు, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉన్నాయని అధికారులకు తెలి యదా.. అని ప్రశ్నించారు. కేజీబీవీ భవనం ప్రారంభించిన మంత్రి.. మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం భవనం, బీసీ హాస్టల్ భవనం గూర్చి ఎందుకు మాట్లాడలేదని అన్నారు. ప్రభుత్వ భవనానికి కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు కట్టడం అధికార దుర్వినియోగమన్నారు. తహసీల్దార్‌కు కుర్చీ ఇవ్వకుండా నిలబెట్టడం బాధాకరమన్నారు. ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. నాయకులు రఫీ, రమేశ్, సడువలి, వెంకటేష్, నవీన్‌నాయక్, నరేశ్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



జడలపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల: పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఒడితల గ్రామం నుంచి మోరంచ వాగు వరకు రూ.50 లక్షలు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఒడితల బద్దిపోచమ్మ ఆలయం వరకు రూ.50 లక్షలు, జడల్‌పేట నుంచి పాసిగడ్డతండా వరకు రూ.162 లక్షలు, రాంచంద్రాపూర్ నుంచి శాంతినగర్ వరకు రూ.30 లక్షలు, పీఆర్ రోడ్డు గుంటూరుపల్లి నుంచి చిట్యాల రోడ్డు వరకు రూ.144 లక్షలు, చింతకుంట రామయ్యపల్లి నుంచి శాంతినగర్‌కు రూ.100 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నైన్‌పాక గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. నాపాక దేవాలయం నుంచి మామిడి తోట వరకు రూ.40 లక్షలు, ఎస్సీ కాలనీ నుంచి మోరంచ బ్రిడ్జి వరకు రూ.20 లక్షలు, చెంచుకాలనీ నుంచి పాశిగడ్డతండా వరకు రూ.207 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నాపాక సర్వతోభద్ర ఆలయంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మిడి శ్రీదేవిసత్యం, నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, గుర్రపు తిరుపతిగౌడ్, గుండు వెంకన్న, కిష్టయ్య, కామిడి రత్నాకర్‌రెడ్డి, పులి తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ జయశ్రీ, ఏఈ శ్రీనివాస్, గద్దం కొంరయ్య, బుర్ర లక్ష్మణ్, గజ్జి రవి, భద్రయ్య, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు..

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని చెంచుపల్లిలో రూ.1.43 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. 16 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరే విధంగా అధికారులతో సమన్వయం చేస్తానన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇస్తున్న రుణాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, నాయకులు పున్నం రవి, ఓంప్రకాశ్, మొట్టె కిరణ్, సురేందర్ రెడ్డి, వీరబ్రహ్మం, సుదర్శన్, భిక్షపతి, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్లి నుంచి గుడాడ్ పల్లి గ్రామం వరకు రూ.200 లక్షలతో నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

- ప్రభుత్వ హామీలను నెరవేర్చాలని డిమాండ్

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో సమగ్ర శిక్షా ఉద్యోగులు 'సీఎం మాట ఇచ్చిన రోజు' ను పురస్కరించుకొని నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు 'సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని' సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని' నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. 2023 సెప్టెంబర్ 13న హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని నేటి సీఎం రేవంత్‌రెడ్డి, నాడు పీసీసీ అధ్యక్ష హోదాలో సందర్శించారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరించి, రెగ్యులర్ చేస్తానని ఇచ్చారని పేర్కొన్నారు. హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పర్మనెంట్ చేస్తానని చెప్పి రెండు సంవత్సరాలు కావస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. విద్యాశాఖ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సేవలను సీఎం గుర్తించి హామీలు అమలు చేయాలని కోరారు. హామీలను అమలు చేసి భవిష్యత్‌లో హామీలను గుర్తింపు దినోత్సవం కాకుండా హామీల అమలు దినోత్సవాలు జరుపుకునేవిధంగా చూడాలని అన్నారు. పేస్కేల్ వెంటనే అమలుచేస్తూ ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, హెల్త్ కార్డులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వేణు, మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు, వసంత, అనిల్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'మతమార్పిడి'పై చర్య తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏబీవీపీ, భజరంగ్‌దళ్ నాయకులు



సీఐ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో మతమార్పిడికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ, భజరంగ్‌దళ్ నాయకులు శనివారం భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎల్‌బీ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సునిల్ ఇంట్లో మతమార్పిడి కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఆ కార్యకలాపాలకు గంగారం మోడల్ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులను రాత్రి సమయంలో తీసుకొచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవలం విద్యార్థుల వ్యక్తిగత హక్కుల మీద దాడి చేయడమే కాకుండా, చిన్నారులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి భవిష్యత్ దిశను మార్చే ప్రమాదకర చర్య అన్నారు. జిల్లా కేంద్రంలో పోస్ట్‌మెట్రిక్ ఎస్సీ, బీసీ బాలికల హాస్టల్ విద్యార్థులను తల్లిదండ్రులు, ప్రభుత్వ అనుమతి లేకుండా బయటకు పంపిన వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక ప్రభుత్వ అధికారి తన అధికారాన్ని వినియోగించి చిన్నారులు, వెనుకబడిన వర్గాల విద్యార్థులను ఇలా తప్పుదారి పట్టించడం సమాజంలో అస్థిరతకు దారితీస్తుందని, ఇలాంటి చర్యలు కొనసాగితే సామాజిక శాంతి భద్రత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గుజ్జుల ప్రేమకుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం రాత్రి ఏబీవీపీ, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వచ్చి విద్యార్థులను వార్డెన్, తల్లిదండ్రులకు అప్పగించారు.

సీసీపీఎల్‌కు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ



డ్రెస్‌లు అందజేస్తున్న సంపత్‌కుమార్ ఇందిర

చిట్యాల: మండలంలోని చల్లగరిగలో నిర్వహిస్తున్న సీసీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ -02లో ఆడుతున్న పవర్ స్టార్ టీమ్‌కు జెర్సీ, లోయర్స్‌ను స్థానిక వాణివిద్యానికేతన్ కర్పస్పాండెంట్ బండి సంపత్ కుమార్ శనివారం అందజేశారు. ఆటల్లో క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఇందిర, క్రీడాకారులు నోముల వేణు, నాగరాజు, రాజు, దేవేందర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబాతో పోలీసులు

రేగొండ: అక్రమంగా గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గంగిరేణి గూడెం తండాకు చెందిన మాలోతు నరహన్ ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా.. నిజాంపల్లి శివారులో తనిఖీ చేసి గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.